# పట్టణంలో లేనివి..

హైదరాబాదునుంచి వాళ్ల వూరు వెళుతూ, మధ్యలో బస్సు దిగి మా ఇంటికి వచ్చారు శివన్న దంపతులు. సంక్రాంతి పండుగకు వాళ్ల ఊరు రమ్మని మరీ మరీ చెప్పి వెళ్లారు. ఆ ఊరెళ్లి ఆరేళ్లవుతోంది. మాది ప్రేమ పెళ్లి. పెద్దల్ని ఎదిరించి పెళ్లి చేసుకున్నాం. శివన్న, మా ఆయన గిరి మంచి మిత్రులు. తనే దగ్గరుండి మా పెళ్లి జరిపించాడు. పెళ్లయిన కొత్తలో వాళ్ల వూరు తీసుకెళ్లాడు. తర్వాత వెళ్లలేదు.

ఐదేళ్లు హైదరాబాద్‌లో ఉన్నాం. తిరుపతికి వచ్చి ఏడాది అవుతోంది. ఇద్దరివీ ప్రభుత్వ ఉద్యోగాలు కాదు. మేం పని చేసేచోట ఎనిమిది గంటల్లో పదహారు గంటల పని చేయిస్తారు. దాంతో బాగా అలసిపోతుంటాం. ఎవరిళ్లకూ పోవడం ఉండదు. మా ఇంటికి వచ్చేవాళ్లూ అరుదు. మూడేళ్ల బాబు ఉన్నాడు. కోడూరులో మాకు తెలిసినవాళ్ల పాఠశాల ఉంటే, అక్కడుంచాం బాబును. పండుగకు శెలవులు ఇవ్వడంతో వాడూ ఇక్కడే ఉన్నాడు. ఒంటరిగా ఉండీ ఉండీ ఈ పట్టణ జీవితం నాకూ విసుగ్గా ఉంది. ఏదో తెలీని వెలితి. కనీసం వారం రోజులపాటు ఎక్కడికయినా పోదామని ఉంది. ఇంతలో శివన్న పండుగకు రమ్మని పిలిచారు. మాకు ఒకరోజు శెలవు ఇచ్చారు. నేను మరో రెండు రోజులు సెలవు పెట్టాను.

ఆఫీసునుంచి మధ్యాహ్నానికంతా ఇంటికి చేరుకున్నాను. గిరి, బాబు అప్పటికే తయారుగా ఉన్నారు. నేనూ స్నానం చేసి చకచకా తయారయ్యాను. ఊర్లో ఉన్న పిల్లలకోసం షాపింగ్ చేయటానికి బజారుకు వెళ్లాం. అటునుంచటే గిరి బైక్‌లో బయల్దేరాం.

తిరుపతి నుంచి శివన్న వాళ్ల ఊరు పాతిక కిలోమీటర్లు. వాళ్ల ఊరు దగ్గరవుతున్న కొద్దీ నాలో తెలీని ఉద్వేగం. పెళ్లయిన కొత్తలో రాత్రి వెళ్లి, తిరిగి ఉదయం వచ్చేశాం. ఆరేళ్ల తర్వాత పోతున్న మమ్మల్ని వాళ్లు ఎలా రిసీవ్ చేసుకుంటారో అని అలజడిగా ఉంది. మాది ప్రేమ పెళ్లి. పెళ్లయ్యాక పెద్దలే సర్దుకుంటారనుకున్నాం. కానీ మా రెండు వైపుల వాళ్లూ మొండి పట్టుదల మానలేదు. దాంతో మాకంటూ బంధువులున్నా ఒంటరిగానే మిగలాల్సి వచ్చింది.

మేము ఆ ఊరు చేరేటప్పటికి సాయంకాలం అయింది.

"ఏమ్మా సుమతి, బాగుండావా? బాగుండావా గిరీ? ఎన్నాళ్లయిందో వచ్చి.. దాదా.. అరరే.. ఏం నాన్నా.. నీకు తాతనురా.. నన్నెప్పుడూ చూడలా కదా.. నువ్వు పుట్టకముందు వచ్చినారు మీ అమ్మానాయనా. తర్వాత ఇదే రావటం.. రా.." అంటూ బాబును దగ్గరకు తీసుకున్నాడు శివన్న నాన్న.

"ఏఁమ్మా.. అసలు మేముండామనుకున్నారా లేమనుకున్నారా.. ఒక జాబులే. జవాబులే. ఒకసారి వచ్చేది లే. ఏదో ఇన్నాళ్లకయినా వచ్చినారు. ఎట్లనో దోవ కనబడింది. పదింటికొగనాడు కనబడి పోతాంటే మాకూ సంతోసంగా ఉంటాది కదా!" కొట్టేదానిలా మాట్లాడింది శివన్న అమ్మ.

అక్కడున్నందరూ దాదాపు అంతే అభిమానంగా మాట్లాడారు. వాళ్ల ఆదరణ చూస్తే నాకు నోటమాట రాలేదు. శివన్న వాళ్లది ఉమ్మడి కుటుంబం. వాళ్ల నాన్న, చిన్నాన్నలు కలిసే ఉంటున్నారు. శివన్న ఉద్యోగం రావడంతో భార్యా పిల్లలతో హైదరాబాదులో ఉంటున్నారు. మిగిలిన వాళ్లంతా పల్లెలోనే ఉన్నారు.

మేము పిల్లలకోసం తీసుకొచ్చిన గాజులు, బట్టలు బయటకు తీశాం. అవి ఏవీ వాళ్లకు పట్టలేదు. అందరూ పెద్దవాళ్లయి పోయారు.

"అప్పుడే అంత పెద్దవాళ్లయిపోయారా?" అన్నాను ఆశ్చర్యంగా.

"కారు లేమ్మా.. అరేడేళ్లకు ఒకసారి రండి. అట్లే ఉంటారు" అన్నాడొక అబ్బాయి బైక్‌ను బయటకు తీస్తూ.

మాతో అంత చనువుగా మాట్లాడుతున్న కుర్రాడెవరో గుర్తురాక పరిశీలనగా చూశా.

"గుర్తు లేనా. ఉండను.. ఎందుకుంటాను? మళ్లా వస్తా" అంటూ బైక్‌లో వెళ్లిపోయాడు.

"ఎవరు శివన్నా" అన్నాను.

"మా అన్నకొడుకు శ్యాం కదా" అన్నాడు.

"ఆఁ.. మేము చూసినప్పుడు ఆరోతరగతి కదాన్నా. ఇంతున్నేడు. అప్పుడే బైక్ నడిపేంత వాడయిపోయాడా!"

"ఈసారి పదేండ్లకు రండి. వాడికి పెళ్లయి బిడ్డలు పుట్టింటారు" అన్నాడు చిన్నాన్న.

ఆ మాటలకు అక్కడున్నందరూ నవ్వారు.

బాబు అప్పుడే వాళ్లందరితో కలసిపోయాడు. పిల్లలతో ఆడుకుంటున్నాడు.

మాకు మేడమీది గది ఏర్పాటు చేశారు. నేనూ, శివన్న వాళ్ల శ్రీమతి తులసి, ఆమె చెల్లెలు గదిలో కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నాం. కాసేపట్లో కాఫీ వచ్చింది. వెంటనే స్నానానికి పిలుపు వచ్చింది. అప్పటికే గిరి, బాబు స్నానం చేసేశారు. తిరుపతిలో ఉన్నంత సేపూ బాబు నన్ను వదిలేవాడే కాదు. ఇప్పుడు నన్ను పట్టించుకోవడమే లేదు.

వాళ్లది చాలా పెద్ద ఇల్లు. ఇంటి ముందు శివన్న వదినె పేడతో అలుకుతోంది. మగవాళ్లంతా అరుగుల మీద కూర్చొని మాటల్లో మునిగిపోయారు. స్నానం చేసి పై గదిలోకి వెళ్లాను. మేం కూడా మాటల్లో పడి టైమెంతయిందో చూసుకోనేలేదు. ఎనిమిది గంటలకు 'ఈ రోజు అన్నం తింటారా.. మాటలే తినేసి పడుకుంటారా?' అంటూ వచ్చాడు చిన్నాన్న.

మేము అంతవరకు మాటలతో పాటు అరిసెలు కూడా తింటున్నాం. ఎన్ని తిన్నామో గమనించలేదు. ఆకలయితే అస్సల్లేదు. తినకపోతే బాగుండదని కిందకు వెళ్లాం. అప్పటికే హాల్లో చుట్టూ చాపలమీద కూర్చోనున్నారంతా. వడ్డించేవాళ్లు కాకుండా పిల్లా పెద్దా కలిపి పందొమ్మిది మందుండాం. ఒకరిమీదొకరు జోకులు వేసుకుంటూ తింటున్నాం.

ఎంతకాలమయింది ఈ విధంగా మమ్మల్ని అభిమానించే వాళ్లందరితో కలిసి తిని. పట్టణాల్లో ఎప్పుడయినా పెళ్లికిపోయినా, ఆహ్వానించిన వ్యక్తి తప్ప మరొకరు తెలిసుండరు. అక్కడ ఇక్కడ కన్నా ఎన్నో రెట్లు ఎక్కువమందితో కలసి తిన్నా ఒంటరితనంగానే ఉండేది. ఆ తేడా ఇప్పుడు స్పష్టంగా తెలుస్తోంది.

"ఐపాయ.. ఐపాయ.. సుమతక్క బలయిపాయ" అన్నాడు శ్యాం గట్టిగా. అందరూ గట్టిగా నవ్వారు. ఉలికిపాటుగా విస్తట్లో చూసి "బామ్మా" అన్నాను నేనూ గట్టిగానే.

"తినమ్మా.. వయసు బిడ్డవు. ఆ మాత్రం తినకుంటే ఎట్లా?" అంది బోసినోటితో నవ్వుతూ.

ఎప్పుడోగాని అంత అన్నం తిన్నదాన్ని కాదు. తినలేక తినలేక తిన్నాను. తినడం అవుతూనే అందరం మేడమీది గదిలోకి వెళ్లాం.

"బోగిమంట ఏసేదానికి చీకటితోనే లేవాల. పడుకోండి" అంది శివమ్మ అమ్మ ఒక డబ్బాను అటకమీద పెడుతూ.

"ఏమున్నాయమ్మా అందులో?"

"మురుకులుందాయి శివా.. కిందుంటే ఎలకలు తినేస్తాయని" అంది ఆమె కిందకు దిగుతూ.

తిరిగి మాటలు మొదలయ్యాయి. శివన్న మురుకుల డబ్బా కిందకు దించాడు. వాళ్లు హైదరాబాదు సంగతులు, మేము తిరుపతి, విజయవాడ సంగతులు చెప్పుకుంటున్నాం. పడుకునేప్పటికి పన్నెండయింది. శివన్న, గిరి, బాబు.. ముగ్గురే మురుకుల డబ్బా ఖాళీ చేసేశారు. ఎలకలు మురుకులు తినేశాయని నవ్వుకున్నాం. లైటాపేసి పడుకున్నాం. పడుకున్నాక కూడా మాటలు. రాత్రి ఎప్పటికో నిద్ర పట్టింది. తెల్లవారి మెలకువ వచ్చేప్పటికి ఇల్లంతా సందడిగా ఉంది. చేతి వాచీలోకి చూస్తే ఆరయింది. మాకు ఆలస్యంగా నిద్ర లేవడం అలవాటు. బోగి కదా. అందుకని ముందే లేచేశాం.

కిందకు వచ్చి చూస్తే అందరూ స్నానాలు చేసేసి కొత్తబట్టలు వేసుకున్నారు. నన్ను చూడగానే "మమ్మీ.. ఇదిగో" అంటూ అరిశె చూపించాడు బాబు.

"ఏరా.. అప్పుడే స్నానం చేసేశావా?" అన్నాను ఆశ్చర్యంగా.

"బాబు మేలు మీ కన్నా. ఐదుగంటలకే స్నానం చేసేసినాడు" అంది శివన్న అమ్మ.

"అందరూ స్నానం చేసినట్టున్నారే. ఐదుకే లేసినారా?"

"ఐదుకా.. రెండుగంటలకే బోగిమంటేసినాం.. మంట మీదే నీళ్లు కాచుకొని మూడుగంటలకే స్నానం చేసినాం" అన్నాడు శ్యాం.

కాఫీ ఇచ్చారు. అంత పొద్దున్నే లేవడం ఎలా సాధ్యమయిందో అర్థం కాలా నాకు. కాఫీ గ్లాసుతో ఇంటిముందుకు వచ్చాను. బోగిమంటలు వీధి పొడవుకూ బూడిద కుప్పలుగా దర్శనమిస్తున్నాయి. రెండు మూడుచోట్ల సన్నటి పొగ వస్తోంది. బూడిద కుప్పల పక్కనే రాగి అండాలున్నాయి. మా కోసం శ్యాం మళ్లీ మంట వేశాడు. మంట దగ్గర కూర్చుంటే చలి తగ్గింది.

"స్నానం చేయండమ్మా.. బోగి మంటకాడ కాచిన నీళ్లుండాయి. మంచిది" అంది బామ్మ.

"ఏం బామ్మా.. మంట వేస్ట్ కాకుండా నీళ్లు కాచినారా" అన్నాను.

"అందుకు కాదే తిక్క మనవరాలా. మనం భోగిమంటలో ఇంట్లో పాడయిపోయిన వస్తువులు ఏస్తామా? ఆ మంటతో కాచిన నీళ్లతో స్నానం చేయడమంటే, మనలో ఏవన్నా తప్పులుంటే వాటిని కడిగేసుకోవడమే. మనల్ని మనం సంస్కరించుకోవడం. అందుకే ఆ నీళ్లతో స్నానం చేయడం" అంది బామ్మ.

"నాకింత వరకూ తెలీదు బామ్మా.. మా వైపెవరూ ఇలా చేయరు"

"మీ వైపే కాదులే.. చాలా దిక్కుల తెలీదు. స్నానానికి లేవండి" అంది అమ్మ.

స్నానం చేయడం ఆలస్యం. మటను, దోశె సిద్ధంగా ఉన్నాయి. ఏడుగంటలు కాలా ఇంకా. నాకయితే ఏదో వింతగా, కొత్తగా ఉంది. ఇంత పొద్దున్నే, చలిలో నిద్రలేచి ఆడవాళ్లు ఎలా వంట చేస్తున్నారో అర్థం కాలా. పావుకేజీకి తక్కువ కాకుండా ముక్కలు వేసేసింది బామ్మ.

"బామ్మా" అన్నాను గట్టిగా.

"ఫరవాలేదు తినమ్మా.. నీ వయసులో నేను ఎంత తినేదాన్నో తెలుసా" అందామె. తిరిగి తనే "ఇప్పుడు కూడా నాకు అరకేజీ కూర కావాల" అంది.

ఆశ్చర్యపోయాను. గిరి, నేను పావుకేజీ మాంసం వండుకుని రెండు పూటలా తింటాం.

తినడం అవుతూనే శివన్న మమ్మల్ని వాళ్ల బంధువుల ఇళ్లకు తీసుకెళ్లాడు. ఊరంతా కలిపి ముప్పైకి మించి లేవు ఇళ్లు. దాదాపు ఊరంతా శివన్నకు బంధువులే. మొదటి రెండిళ్లలో మొహమాటానికి పోయి చేయి కడగాల్సి వచ్చింది. తింటే ఇబ్బంది పడాల్సి వస్తుందని మిగిలిన ఇళ్లల్లో తినలేదు. తినలేదని నిష్ఠూరాలు, అలగడాలు కూడా.

వాళ్ల అభిమానానికి నవ్వాలో, నేను తినలేని దానికి ఏడవాలో అర్థం కాని స్థితి. నడిచే ఓపిక కూడా లేదు. భుక్తాయాసం. ఇంటికొచ్చి పడుకున్నాం. పడుకోవడానికి కూడా ఇబ్బందిగా ఉంది. గిరి భోజన ప్రియుడు. అటువంటి వాడు కూడా ఇక్కడ 'భోజనం' అంటేనే 'అమ్మో' అంటున్నాడు.

శివన్న వాళ్లకు చెరుకు తోట ఉందట. మధ్యాహ్నం అందరం అక్కడకు బయల్దేరాం. చెరుకులు బాగా ఏపుగా ఉన్నాయి. శ్యాం చెరుకులు విరిచి పైనున్న ఆకులు తీసిచ్చాడు. గిరితో సహా అందరూ తింటున్నారు. నేను వాళ్లందరినీ చూస్తూ చెరుకును చేతిలో పట్టుకుని కూర్చున్నాను.

"నువ్వూ తినమ్మా" అన్నాడు చిన్నాన్న.

"తనకు తినడం రాదు" అన్నాడు గిరి నవ్వుతూ.

"తినడం రాదా?" అడిగారంతా ఆశ్చర్యంగా.

"అవును.. ఎప్పుడూ చెరుకు తినలేదు" అన్నాను. చెరుకు తినడం రానందుకు అంతమందిలో సిగ్గనిపించింది.

"ఒక బిడ్డకు తల్లయినావు, చెరుకు తినడం రాదా" అని నవ్వుతూ చెరుకును చిన్న చిన్న ముక్కలు చేసిచ్చాడు శ్యాం. ఒక చెరుకు గడ నేనొక్కదాన్నే తినేశాను. సాయంకాలానికి అందరం ఇల్లు చేరుకున్నాం. ఇంటి ముందంతా అలుకుతున్నారు.

రాత్రి ఎక్కువసేపు మేలుకోవడం, ఉదయం తొందరగా నిద్రలేవడం, పగలంతా పడుకోవడంతో నిద్ర ముంచుకొస్తోంది. అందరితోపాటు భోజనానికి కూర్చుంటే తిండితో చంపేస్తారనిపించింది. వంటగదిలోకి వెళ్లి నేనే పెట్టుకుని కొద్దిగా రసం అన్నం తిన్నాను. అందరం మేడమీదకు చేరాం.

రకరకాల మాటలు. పల్లెల్లోని మూఢనమ్మకాల గురించి, దెయ్యాలపైనా, రామాయణ మహాభారతాల పైనా చర్చలు. ఒకరు ఔనన్నదాన్ని మరొకరు కాదనడం. నాకయితే ఎత సంతోషంగా ఉందో. ఇంతమంది మనుషులతో రాత్రుల్లో మేడమీద కూర్చుని ఎప్పుడయినా కబుర్లు చెప్పానా? అసలు ఎక్కడయినా చూశానా? లేదు.

పట్టణంలోని బస్సుల్లో విద్యార్థులో, ఫంక్షన్లలో బంధువులో కలిసినప్పుడు కూడా జానీ హిట్టా, సింహాద్రి హిట్టా అనో, ఈసారి కాంగ్రెస్ గెలుస్తుందా, గెలవదా అనో చర్చలుంటాయి. క్రికెట్ సీజనయితే చెప్పాల్సిన పనేలేదు. అపరిచితులు మాట్లాడుకున్నా అవే మాటలుంటాయి. పిల్లలకు తప్పకుండా తెలియాల్సిన ఇతిహాసాలపైన ఏ కుటుంబంలో చర్చలు చేస్తున్నారు? ఇళ్లల్లో టీవీ పిచ్చి.

పదకొండు గంటలకు భోజనానికి కిందకు దిగాం. నాకయితే కడుపులో ఆవగింజంత ఖాళీ కూడా లేదు. ఒంటరిగా పడుకోను భయం. అందరూ తిన్నదాకా ఉండి, గిరితో పాటు వెళ్లి గదిలో పడుకున్నా. వెంటనే నిద్ర పట్టేసింది.

భోగిమంటలు ముందురోజే ఐపోవడంతో తెల్లవారి తొందరగా లేవలేదు. నింపాదిగా ఎనిమిది గంటలకు నిద్రలేచాను. అప్పటికే ఆడవాళ్లంతా స్నానాలు చేసి గారెలు, అరిశెలు చేస్తున్నారు. నేనింతవరకు పడుకున్నందుకు ఏమనుకున్నారో ఏమో. గబగబా స్నానం చేసి బట్టలు మార్చుకుని వాళ్ల వద్దకు వెళ్లాను. "నువ్వు తింటూ చూస్తా ఉండు. మా పనుల జోలికి మాత్రం రావద్దు" అన్నారు వాళ్లు. అంతమంది కష్టపడుతుంటే చూస్తా ఉండటానికి మనసొప్పలేదు. పచ్చడి నూరడానికి మాత్రం అనుమతి ఇచ్చారు.

పెద్దలకు బట్టలు పెట్టి ఉపవాసం తీరేప్పటికి మధ్యాహ్నం ఒంటిగంటయింది. అందరం తిని ఇంటి ముందు కూర్చున్నాం. ఇంతలో గొబ్బెమ్మను తీసుకుని కొందరాడవాళ్లు వచ్చారు.

జల్లెడలో పెద్దముద్దనుంచారు. దానికి బియ్యపు గింజలతో ముక్కు, చెవులు, నోరు, కళ్లు ఏర్పాటు చేశారు. పసుపు, కుంకుమ బొట్లు పెట్టారు. దాని చుట్టూ తంగేడు, గురుగు, గుమ్మడి పూలు వేశారు. గొబ్బెమ్మ ఉన్న జల్లెడను కిందపెట్టి చుట్టూ వలయాకారంగా ఆడవాళ్లు పదిమంది దాకా చేరి పాటలు పాడుతున్నారు.

"గొబ్బియలో కురిసేవు కుంభవరసాము మా పల్లెలో
గొబ్బియలో కుంటాలు కుంటాలు రెండు కుంటాలు
గొబ్బియలో ఓటుకుంటాయొకటి వైకుంటమొకటీ
గొబ్బియలో బాటాలు బాటాలు రెండు బాటాలూ
గొబ్బియలో కాశీకి ఒగబాటా జగతీకి ఒగబాటా
గొబ్బియలో కాల్వ కిందైన ఏమేమి బండూ

గొబ్బియలో సన్నవారీ బందు స్వామి తలగలకూ" అని పాడి ఆపింతర్వాత యాభై రూపాయలు ఇమ్మని శివన్నను అడిగారు.

పది రూపాయలు ఇస్తానన్నాడు. వాళ్లు ఒప్పుకోలేదు. ఇంకా పాడమన్నాడు.

"ఉయ్యాల జంపాల గొబ్బియలో
నాయరాజా పేరేమిరా గొబ్బియలో
నాయరాజూ పేరు శివన్నరా గొబ్బియలో
నాయరాజ బారియ గొబ్బియలో
సిలకల తులసి గొబ్బియలో.."

"ఆపండాపండి.. మాపైన పాట వద్దు. ఇంకేదైనా పాట. ఒక్కటైనా చాలు. తప్పుల్లేకుండా పాడండి. యాభై ఇస్తాను" అన్నాడు శివన్న.

వాళ్లు పాడే ప్రతి పాటలోనూ శివన్న తప్పులు చూపిస్తున్నాడు. నాకయితే ఇదంతా వేడుకగా ఉంది. వాళ్లు తప్పులు పాడడం భరించలేక చివరకు శివన్న వాళ్లతో జతకలిశాడు.

నులుగెత్తుకున్నాడు.

"గౌరమ్మా గౌరమ్మ అప్పసెల్లెంద్రా గొబ్బియల్లో గొబ్బియలో
ఒగతల్లి బిడ్డలకు వైరమూలేల గొబ్బియల్లో గొబ్బియలో
మంచి మంచి పూలేరి ఒగరాసి పోసిరి గొబ్బియల్లో గొబ్బియలో
కానరాని కలువలేరి ఒగరాసి పోసిరి గొబ్బియల్లో గొబ్బియలో.."

ఇలా ప్రవాహంలా పాట సాగుతోంది.

శివన్న పాటలు పాడతాడని తెలుసుకానీ, ఇంత బాగా పాడతాడని తెలీదు నాకు. చాలాసేపు వాళ్లతోనే గడచిపోయింది. అంతసేపు పాటలు పాడించినందుకు యాభై రూపాయలు ఇచ్చినాడు. నిద్ర ముంచుకొస్తుండటంతో వెళ్లి పడుకున్నాను.

గణగణమని శబ్దం రావడంతో మెలకువ వచ్చింది. అప్పటికే చీకటయిపోయింది. దీపాలు వెలుగుతున్నాయి. గబగబా కిందకు వచ్చాను. పిల్లలంతా గజంకన్నా ఎత్తుగా ఉండే దీపస్తంభం తీసుకుని దీపం వెలిగించారు. వెంట పెద్ద క్యారేజీ ఒకటి తీసుకుని గంట వాయిస్తూ ఇల్లిల్లూ తిరుగుతున్నారు. ప్రతి ఇంటి వద్దా నూనె పోస్తున్నారు. నూనె వేయని వారు డబ్బు ఇస్తున్నారు.

"ఎందుకు శివన్నా ఇలా" అడిగాను.

"ఏమమ్మా టౌను పిల్లా.. నీకు బొత్తిగా మన పండగల గురించి తెలిసేటిగా లేదే. ఊర్లో రాముల వారి గుడి ఉండాది కదా. ఆడ రోజూ దీపం వెలిగించాల. నూనె ఎక్కడ్నించి వస్తాది. ప్రతి సంకురాతిరి పండక్కు ఊర్లో పిల్లోల్లంతా ఇల్లిల్లూ తిరుగుతారు. పంటలు పండినోళ్లు నూనె పోస్తారు. పండనోళ్లు ఐదోపదో డబ్బులిస్తారు. ఆ నూనె సమచ్చరం పాటు గుళ్లో దీపం వెలిగించడానికి సరిపోతుంది" అంది బామ్మ.

ఈ పద్ధతి బాగుందనిపించింది. అందరూ భోజనానికి కూర్చుంటున్నారు. మధ్యాహ్నం తిన్న నేతిగారెలు, అరిశెలు, పప్పన్నం ఇంకా అరగలేదు. నాకు అన్నం వద్దనే వద్దన్నాను. అయినా వాళ్లు వినలేదు. ఇబ్బంది పడుతూ తినాల్సి వచ్చింది. మనుషులను తిండితో కూడా ఇబ్బంది పెట్టవచ్చని ఇక్కడే తెలిసింది. మేడమీది గదిలోకి చేరాం.

నేనూ, గిరి, శివన్న, శ్యాం పేకాడదామనుకున్నాం. పేకముక్కలు కావాలని ఏడుస్తుంటే వాటిని దాపెట్టి బాబును నిద్రబుచ్చాను. పేకను తీసుకున్నాం అడ్డంకోసం. శివన్న మరదలు వచ్చి వాళ్ల ఏడాదిన్నర బాబును చూసుకోమని చెప్పి కిందకు వెళ్లింది. వాడు మా బాబుకన్నా అల్లరి ఎక్కువ. వాడిక్కూడా పేకముక్కలే కావాలంట. వాడిని నిద్రబుచ్చాలని ఎంతగా ప్రయత్నించినా సాధ్యం కాలేదు. అంతమందిమి కూర్చోనుంటే వాడికి ఆటగా ఉంది. అందరి చేతులు మారతాడు. ఏవేవో చెప్తాడు. మాకు అర్థమయితే కదా. పదకొండయినా వాడు నిద్రపోలా. ఆకలయిందేమో ఏడుపు మొదలు పెట్టాడు. శ్యాం వాడిని తీసుకెళ్లి కింద ఇచ్చి వచ్చి "ఈ ఆడవాళ్లకు అలికే పని తప్పిస్తే ఇంకోటి ఉండదేమో" అన్నాడు కూర్చుంటూ.

నేను వచ్చిన రోజునుంచి గమనిస్తున్నా. అంత పెద్ద లోగిలిని రోజూ అలికి ముగ్గులు పెడుతున్నారు. పట్టణాల్లో అయితే టైల్స్ ఉన్న గచ్చులను ఊడ్చడానికి, కడగడానికి పనిమనిషి కావాల్సిందే. వీళ్లది ఓపిక అనాలో, పట్టణాల్లో వాళ్లది సోమరితనం అనాలో అర్థం కాలా నాకు.

అర్ధరాత్రి కావస్తాంది కదా అని లైటాపి పడుకున్నాం.

జంగమాయన గంట చప్పుడుకు మెలకువ వచ్చింది. అప్పటికి తెల్లవారి పోయింది. గబగబా కిందకు దిగాను. బాబు, గిరి కూడా కిందే ఉన్నారు. మాంసం కూర వాసన.

"అప్పుడే కూరయిందా?" అన్నాను ఆశ్చర్యంగా.

"ఒక ట్రిప్పు తినడం కూడా అయిపోయింటే" అన్నాడు టీ తాగుతున్న శ్యాం.

"ఒగ పొట్టేలే కదా.. ఎంత సేప్పడుతుంది కూర చేయడానికి" అంది శివన్న అమ్మ దోసెలు పోస్తూ.

"ఏంటి.. ఒక పొట్టేలు కోసినారా?"

"ఔను.. ఒగటే.. నిరుడయితే రెండు కోసిన్నేం" అన్నాడు శ్యాం.

"అమ్మో.." అన్నాను.

అరకేజీ మాంసం వండాలంటేనే నానా తంటాలు పడుతుంటాను. వీళ్లు ఏకంగా ఒక పొట్టేలుకి పొట్టేలునే ఉదయం ఎనిమిదికంతా కూర చేసేసి తింటూంటే నమ్మలేకపోతున్నాను. శివన్న, వాళ్ల నాన్న, చిన్నాన్నలిద్దరు ఇంటి వెనక కొట్టంలో పశువులకు కొమ్ములు జుగురుతున్నారు. నేనూ పళ్లు తోమి స్నానం చేసి టిఫిను భోజనం కన్నా ఎక్కువగా తినాల్సి వచ్చింది. టిఫిను అనడం కన్నా మాంసం అనొచ్చేమో.

శివన్న ఇంట్లో ఉండనివ్వకుండా బంధువుల ఇళ్లకు బయలుదేరతీశాడు. వాళ్ల ఇళ్లక పోవాలంటే నాకు భయం, తిండితో ఇబ్బంది పెడతారని. అందరిళ్లలో మాంసమే. అందరూ తినమని బలవంతం చేయడమే. ఎంతగా వద్దని చెప్పినా కొందరు వినలేదు. తినకపోతే అలగడం, వాళ్లు నాకు ఆప్త బంధువులయినట్టు. వాళ్ల అభిమానం చూస్తే ఎంతో కొంత తినక తప్పలేదు. అందరిళ్లు చుట్టి మధ్యాహ్నానికి ఇల్లు చేరాం. అప్పట్నించే ఊర్లో సందడి ప్రారంభమయింది.

పశువులను అప్పటికే చెరువులో ఈత కొట్టించారు. కొమ్ములకు రంగులు వేశారు. కుప్పెలు తగిలించారు. బూరలు ఊది కొమ్ములకు కట్టారు. వీపును చుడుతూ నల్లదారాలు కట్టి అందంగా తయారు చేశారు.

లంగా రవికెలు వేసుకునే చాలామంది అమ్మాయిలు ఆరోజు వోణీలు వేసుకుని ముస్తాబయ్యారు. నాలుగు గంటలకు భజంత్రీలు ముందు నడుస్తుంటే పశువులను పసలమంద దగ్గరకు తీసుకెళ్లారు. ఊరు ఊరంతా అక్కడకు చేరుకుంది. కాటమరాజు గుడి వద్ద పాల పొంగళ్లు పెట్టారు. అందరూ అక్కడ కొబ్బరి కాయలు కొడుతున్నారు. కొందరు అక్కడున్న తంగేడు చెట్టుకు అరిశెలు కడుతున్నారు. మొక్కుబడులు అలా తీర్చుకుంటారని బామ్మ చెప్పింది. మూడు నిలువులెత్తు పేర్చిన కంపలకు నిప్పు పెట్టి పశువులను వదిలేశారు. నాల్కలు చాపుతూ లేస్తున్న మంటలను చూడగానే పశువులన్నీ పరుగులు తీయసాగాయి. అందరూ ప్రసాదం తింటూ ఇళ్లదారి పట్టారు.

ఇంటికొచ్చిన అరగంటకంతా మేం బయల్దేరేశాం. పొద్దున్నే పోదురని బలవంతం చేశారు. పొద్దున్నే చలి ఎక్కువగా ఉంటుందన్నాం.

"ఐదారేండ్లకు ఒకసారి కాకుండా ఏడాదికి రెండుమూడుసార్లన్నా వస్తాండండి" అన్నారు వాళ్లు.

వాళ్ల అభిమానానికి కళ్లు చెమర్చాయి. మేం బయల్దేరుతుంటే దాదాపు ఊర్లో వాళ్లంతా వచ్చారక్కడకు.

"మా ఇంట్లో చేయి కడగకుండానే పోతాండావే" అందొకామె.

"కడుపయితే ఖాళీగా లేదు. చేయి కావాలంటే కడుగుతా" అన్నాను.

ఆ మాటలకు అందరూ నవ్వారు. ఆమె చిన్నబుచ్చుకుంది.

"ఈసారి వచ్చినప్పుడు మీ ఇంట్లోనే ఉండి తింటాంలే. నువ్వు పొమ్మనే దాకా పోము" అన్నాను.

"నేనెందుకు పొమ్మంటాను. ఉండాల్నే గానీ లక్షణంగా చేసి పెడతా" అందామె.

"మళ్లీ ఎప్పుడొస్తారక్కా" అన్నాడు శ్యాం. వాడు బాధపడుతున్నట్టున్నాడు.

"వేసవి శెలవుల్లో వచ్చి నిన్ను తీసుకెళ్తాం. బాగా చదువు" అన్నాను.

అలాగేనన్నట్టు తలూపాడు శ్యాం.

"పోయొస్తాం" అని చెప్పి బయల్దేరాం.

మేం కనిపించేంత వరకు వాళ్లందరూ చూస్తూనే ఉన్నారు.

దారి పొడవునా రకరకాల ఆలోచనలు. మాకు ఇన్నాళ్లూ ఎవ్వరూ లేరు. ఒంటరివాళ్లం అనుకునేవాళ్లం. ఇంతమంది మమ్మల్ని అభిమానించే వాళ్లు, నా.. అనే వాళ్లు ఉన్నారనుకోగానే చాలా సంతోషం వేసింది. మాకూ, వాళ్లకూ ఎలాంటి బంధుత్వం లేదు. కానీ ఇప్పుడు వాళ్లు మా వాళ్లు. ఇంకెప్పుడూ ఒంటరి వాళ్లం అని బాధపడాల్సిన పనిలేదు. శెలవులప్పుడంతా అక్కడకు వెళ్తే చాలు. పట్టణంలో లేనివి అక్కడ దొరుకుతాయి! •

*ఆంధ్రప్రదేశ్ మానవత్రిక దీపావళి కథల పోటీల్లో (2003)*
*బహుమతి పొందిన కథ*